క్లుప్తంగా

నాణ్యమైన ఆహారం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



ఆహారాన్ని పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్‌ను, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యమైన పదార్థాలు మాత్రమే వాడాలన్నారు. కాలం చెల్లిన పదార్థాలు వాడకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన అడిషనల్ పీపీ



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అడిషనల్ పీపీ కనకయ్య

సిద్దిపేటకమాన్: సిద్దిపేట అడిషనల్ సెషన్ కోర్టు పీపీగా బాధ్యతలు చేపట్టిన కనకయ్య పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ అడిషనల్ పీపీని అభినందించారు. కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కీలకపాత్ర వహించాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్‌కోర్టు అడిషనల్ పీపీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కోటిలింగాల ఆలయం, హనుమాన్‌నగర్‌లో గురువారం ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయివిద్యనగర్, రచ్చబండ, మారుతినగర్, సంతోష్‌నగర్, ఎన్‌జీవోస్ కాలనీ, ముదిరాజ్‌గడ్డ, రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో బుధవారం ఉ. 9గంటల నుంచి మ.12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రైతులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి



ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో నవీన్

గజ్వేల్‌రూరల్: రైతులు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని అక్కారం గ్రామ ఏఈఓ నవీన్ తెలిపారు. మండలంలోని అక్కారం రైతువేదికలో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపులో ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. ఈనెల 15లోగా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

సిద్దిపేటకమాన్: 77 సంవత్సరాల క్రితం ఐదుగురు విద్యార్థులతో స్థాపించిన ఏబీవీపీ అంచలంచెలుగా ఎదుగుతూ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందని ఏబీవీపీ స్టేట్ ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్ మణికంఠ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 77వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను సిద్దిపేట పట్టణంలో ఏబీవీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏబీవీపీ అనునిత్యం పోరాటం చేస్తోందన్నారు. ఏబీవీపీ కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏబీవీపీ నాయకులు వివేక్‌వర్ధన్, విజయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన దారులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్మికులు ధర్నా, ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. 29 రకాల కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులతో పాటు అన్ని రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని కోరారు.



దుబ్బాకలో కార్మికుల నిరసన ర్యాలీ



జగదేవ్‌పూర్(గజ్వేల్): తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు



సిద్దిపేట పట్టణంలో..



హుస్నాబాద్ పట్టణంలో..

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాజక్కపేట, అప్పనపల్లి, హసన్‌మీరాపూర్, తిమ్మాపూర్, పెద్దగుండవెళ్లి, పద్మనాభునిపల్లి గ్రామాలకు చెందిన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే స్థానిక సంస్థలు జరిగే అవకాశం ఉందని, పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులనే గెలిపించుకోవాలని తెలిపారు. గ్రూప్ రాజకీయాల జోలికి వెళ్లకుండా ఒకరి నొకరు అర్థం చేసుకుని ముందుకు సాగాలన్నారు. స్థానిక సంస్థలల్లో ఎక్కువ మంది అభ్యర్థులను గెలిపించుకోవాలని, రాష్ట్రంలో ప్రజలంతా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని, మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

పచ్చదనం దిశగా పయనిద్దాం

జిల్లా క్రీడా యువజన అధికారి వెంకట నర్సయ్య

హుస్నాబాద్: పట్టణంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నెహ్రూ యువ కేంద్ర, సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'అమ్మ చెట్టును కాపాడుదాం-విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా యువజన అధికారి జంగపల్లి వెంకట నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు అమ్మ చెట్టును పెంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిద్దామన్నారు. ఇంటి వద్ద మొక్కలను పెంచి పచ్చదనం దిశగా పయనించాలని కోరారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని చూపాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మమత, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నర్సయ్య

ప్రజల రక్షణకు పెద్దపీట

సీపీ అనురాధ



సీపీ అనురాధకు మొక్కను ఇస్తున్న ఎస్ఐ

సిద్దిపేటకమాన్: ప్రజల రక్షణకు పెద్ద పీట వేయాలని సీపీ అనురాధ సూచించారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కె.రాజేష్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మత్తు పదార్థాల నివారణకు ఉక్కుపాదం

ఎస్ఐ అభిలాష్



నార్కటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోహెడ(హుస్నాబాద్): గంజాయి, ఇతర మత్తుపదార్థల నిర్మూలనే లక్ష్యంగా బుధవారం మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ.. మత్తుపదా ర్థాలు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. పాన్‌షాపు, కిరాణ షాపు, బెకరీ, టీస్టాల్‌లో మత్తుపదార్థాలు కలిపిన చాక్లెట్స్ విక్రయిస్తే చట్టాపరంగా చర్యలు తప్పవన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లి దండ్రులు కనిపెట్టుతూ ఉండాలన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రెండ్రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. కొండపాక పంపింగ్ స్టేషన్‌లో పంపుల మరమ్మతు పనుల కారణంగా కోమటిబండ నుంచి నీటి సరఫరా నిలిచిపోనుందన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 1, 2, 3, 4, 5, 9. 10, 11, 13, 14, 15, 16, 17వార్డుల్లో, గురువారం 6, 7, 8, 12, 18, 19, 20 వార్డుల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 12మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.25వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని పెట్టాలి

డీఎస్ఓ తనూజ



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ తనూజ

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఎస్ఓ తనూజ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల సిబ్బంది ఎప్పటికప్పుడు వంటలను పరిశీలించాలన్నారు. వంటకు శుభ్రమైన ఆహార పదార్థాలనే వాడాలన్నారు. ప్రిన్సిపాల్ శారద, ఎంపీడీఓ భాస్కరశర్మ, ఎంఈఓ ప్రభుదాస్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకొని ఐఐఐటీలో సీటు సాధించిన విద్యార్థిని మీర్జా సపూరాను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. పదిలో 570 మార్కులు సాధించి జిల్లాలో మూడవ స్థానం సాధించుకోవడంతో పాటు బాసర ఐఐఐటీలో సీటు సాధించిన విద్యార్థిని ఆదర్శనీయమని ప్రధానోపాధ్యాయుడు నాగేందర్‌రెడ్డి కొనియాడారు.

ఆర్‌వీఎం ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ములుగు(గజ్వేల్): ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రిలో ఓ రోగికి వైద్యులు అరుదైన అయోటిక్ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ గోపికృష్ణ, సీఈఓ శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోగులపల్లికి చెందిన బోనగిరి యాకయ్య(52), గత కొద్ది సంవత్సరాలుగా కిడ్నీలు, చిన్నపేగు, రెండు కాళ్లకు గుండె నుంచి వచ్చే రక్తనాళం మూసుకుపోయింది. దీంతో ఆ జబ్బు నయం చేసుకునేందుకు రోగి అనేక ఆస్పత్రులకు వెళ్లినప్పటికీ ఫలితం దక్కలేదు. చివరకు రోగి కుటుంబీకులు అధునాతనమైన వైద్యం కోసం ఆర్‌వీఎం ఆస్పత్రి వైద్యులను ఆశ్రయించారు. దీంతో వైద్యులు కార్డియో తోరసిక్ సర్జన్, డాక్టర్. బాధ్వాజ్, డాక్టర్. విశ్వనాథ్, డాక్టర్ లక్ష్మీ, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్. విజయ్ మోహన్, డాక్టర్.కిషోర్‌లు రోగి యాకయ్యను వెంటనే ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని అన్నిరకాల ఉచిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం పది గంటల సమయం పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. రోగి కుటుంబ సభ్యులు ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఈఓ శ్రీనివాసరావు

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

సిద్దిపేటరూరల్: 61 ఏళ్ల వయస్సు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ వీఆర్‌ఎల వారసుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజలింగం మాట్లాడుతూ.. 2020 సెప్టెంబర్ 9న అసెంబ్లీలో వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారన్నారు. గత ప్రభుత్వ హాయాంలో సమ్మెలు చేపట్టగా తమ సంఘం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి జీఓ నంబర్ 81, 85లను విడుదల చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్‌ఏల్లో డిగ్రీ చదివిన వారికి వివిధ విభాగాల్లో 16,758 మందిని సర్దుబాటు చేశారు. కాని మిగిలిన వీఆర్‌ఏ వారసులు 3,797 మందికి ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో వడ్లూరి శ్రీనివాస్, మధు, నారాయణ, లింగం, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఏఓ రెహమన్‌కు వినతిపత్రాన్ని వారసులు

పరుగుతోనే జీవితం మెరుగు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

సిద్దిపేటకమాన్: వ్యాయామం, పరుగుతోనే జీవితం ఆరోగ్యంగా ఉంటుందని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి అన్నారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించబోయే మూడవ ఎడిషన్ హాఫ్ మారథాన్ రన్ గోడపత్రికను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాఫ్ మారథన్ రన్‌కు జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ప్రతినిత్యం వివిధ రకాల వ్యాయామాలు చేయాలన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు సిద్దిపేట కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి, న్యాయవాదులతో కలిసి రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు హాఫ్ మారథన్ రన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు రాజు, అశోక్, కీసర విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఐదు ఎకరాల్లో మొక్కలు పెంచుతాం

కొమురవెల్లి ఆలయ ఈఓ అన్నపూర్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ భూముల్లోని ఐదు ఎకరాల్లో మొక్కలు పెంచుతామని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. బుధవారం వన మహోత్సవంలో భాగంగా రాజీవ్‌రహదారి పక్కన గల భూముల్లో తహసీల్దార్ దివ్య, ఎంపీడీఓ శ్రీనివాస వర్మతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయానికి అవసరమైన కొబ్బరి, మామిడి, బిల్వ, అరటి, పూల మొక్కలను పెంచనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు సహకరిస్తే మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామపంచాయతీకి అప్పగిస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆలయ ఈఓ అన్నపూర్ణ, తహసీల్దార్ దివ్య

సహాయం చేసే స్థాయికి ఎదగాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఇతరులకు సహాయం చేసే స్థాయికి ఎదగాలని పూర్వ లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. లక్షా 20వేల సైన్స్,మ్యాథ్స్ పరికరాలను బుధవారం విద్యార్థులకు అందజేశారు. లయన్స్ క్లబ్ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధికి లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కూతురు సహకారంతో ప్రతి ఏటా రూ.కోటి 20లక్షల ఆర్థిక సాయాన్ని పేద విద్యార్థుల అభ్యున్నతికి సేవలందిస్తున్నామన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ ఎస్సీ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. తిగుల్ హాస్టల్‌లో వార్డెన్ విద్యార్థులతో మూత్రశాలలు శుభ్రం చేయిస్తున్నాడని ఆరోపించారు. బుధవారం జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో యూఎస్‌ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి విద్యార్థులకు తిగుల్‌లోని ఎస్సీ హాస్టల్ వార్డెన్ కాస్మోటిక్ చార్జీలు అందించడం లేద ని మండిపడ్డారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, ప్రతి రోజు వార్డెన్ విధులకు హాజరవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తిగుల్ ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులను విచారించి, చర్య లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఊరూరా మహిళా శక్తి సంబరం



గౌరారంలో ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో మహిళలు

వర్గల్(గజ్వేల్): ఇందిరా మహిళాశక్తి సంబరాలతో ఊరూరా పండుగ వాతావరణం నెలకొంది. బుధవారం వర్గల్ మండలం గౌరారం, చౌదరిపల్లి, మైలారం, జబ్బాపూర్, చాంద్‌ఖాన్‌మక్త తదితర గ్రామాల్లో సీసీల పర్యవేక్షణలో అక్కడి గ్రామైక్య సంఘాల అధ్యక్షతన స్వయం సహాయక సంఘం మహిళలు సంబరాలు నిర్వహించారు. పెరటికోళ్లు, గొర్రెపిల్లలు, పాడిగేదెల పెంపకం, వడ్డీలేని రుణాలు, బీమా ప్రయోజనాలు, జీవనోపాదులు, సాధించిన విజయాలపై చర్చించారు. కార్యక్రమంలో సీసీలు పద్మలత, నర్సింలు, సంఘ అధ్యక్షుడు సంతోష, రేణుక, వీఓఏలు స్వరూప, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలతో ప్రయోజనం:

దౌల్తాబాద్(దుబ్బాక): మహిళా ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ మండల ఏపీఎం యాదగిరి సూచించారు. బుధవారం మండలంలోని దొమ్మాటలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా ప్రమాదబీమా కింద పది లక్షలు లోన్ అందిస్తుందన్నారు. ఇన్సూరెన్స్‌కు మహిళలు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం లేదని 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వరకు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ భిక్షపతి, వీఏఓలు, ఉపేంద్ర, బాల్‌రెడ్డి, స్వయం సహాయక సంఘం లీడర్లు, మెంబర్లు హాజరయ్యారు.



దొమ్మాటలో ఇందిరా మహిళా శక్తి సంబురాలు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్డీఓ ఏపీడీ సుధీర్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకోడూరు, చంద్లాపూర్ గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసే వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాద బీమా, రుణబీమా అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం విద్యాసాగర్, ఏపీఎంలు ఆంజనేయులు, పరశురాములు, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, వీఓఏలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు.